క్లుప్తంగా

శిక్షణ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం డీఈవో కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ రెండో విడత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం సెంటరలో సరైన ఫ్యాన్లు లేక ఉడకపోతకు ఇబ్బందులు పడుతున్నామని, ఎండలు ఎక్కువ ఉండటంతో ఇబ్బందిగా ఉందన్నారు. సంబంధిత అధికారులు శిక్షణ కేంద్రాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రీతి, మహిపాల్, గంగాధర్, వామన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలని ఎస్సై విక్రం అన్నారు. మంగళవారం మండలంలోని గెర్రె గ్రామ యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు, క్రీడల్లో సైతం రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పేకాట, కోడిపందాలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి: విత్తనాలు కొనుగోలు చేసే సమయం సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. మండలంలోని రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. ఐఎస్ఐ మార్కు గల విత్తనాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. విత్తనాలు అమ్మిన వారికి తప్పకుండా బిల్లులు ఇవ్వాలని సూచించారు.

ఎంపీడీవోకు సన్మానం



గంగాసింగ్‌ను సన్మానిస్తున్న నాగోరావు, మాడవి రూప్‌దేవ్

నార్నూర్: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన గంగాసింగ్‌ను మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఖందేవ్ ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు, మాజీ సర్పంచ్ మాడవి రూప్‌దేవ్ సన్మానించారు. ఆదివాసీల గురించి అవగాహన తెలిసిన వ్యక్తి ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. ఎంపీవో సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ను కలిసిన ఎమ్మెల్యే



వెన్నెలతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అదే విధంగా చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణను కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



తాటిపల్లి పెన్‌గంగా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

ఇసుక దందా..!

- కౌటాలలో యథేచ్ఛగా రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు

కౌటాల: సహజ వనరులు కోకొల్లలుగా ఉన్న మండలంలో వాటి విధ్వంసం కూడా అదేస్థాయిలో జరుగుతోంది. ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ లేక ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాగులు, వంకలు, నదుల నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా జరుగుతున్న అక్రమ దందాను అడ్డుకునే వారు కరువయ్యారు. ఇసుకతో దళారులు రూ. లక్షలు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు సహజ వనరులు దెబ్బతింటున్నాయి. ఇసుక తరలింపుతో నదుల్లో, వాగుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

ఇసుక అక్రమార్కులకు వరం..

ఉమ్మడి మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులకు ఇసుక దందా కాసుల పంట పండిస్తోంది. కొందరు వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వాగులు, వంకల్లో ఇసుక తవ్వుతున్నారు. తాటిపల్లి గ్రామ సమీపంలోని పెన్‌గంగా నది, ముత్తంపేట వాగు, భూరెపల్లి ప్రాణహిత నది, డబ్బా వాగుల నుంచి ఇసుక పెద్దఎత్తున తరలుతోంది. ఆయా నది, వాగుల నుంచి ప్రతీరోజు 30 నుంచి 50 ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారంటే ఏ మేరకు రవాణా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇసుక వ్యాపారులు ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.1500 నుంచి రూ.1800 వరకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు అధ్వానంగా మారడంతో పాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అప్పుడప్పుడు తనిఖీలు చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లకు అధికారులు నామమాత్రంగా జరిమానా విధిస్తున్నారు. అనంతరం షరా మామూలే అవుతోంది.

కంటిమీద కునుకు కరువు..

ఇసుక రవాణా జరుగుతున్న పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ల వేగానికి అడ్డూ అదుపు లేదు. కనీసం వెనకాల వచ్చే వాహనాలకు కూడా దారి ఇవ్వని పరిస్థితి ఉంది. ట్రాక్టర్ల మోతకు పరిసర గ్రామస్తులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. అధికారులు స్పందించి ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. ఇసుక రవాణాపై నిఘా పెంచుతామని, అక్రమంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు గాలికి..

నదులు, వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తరలించాలంటే అనుమతులు తప్పనిసరి. గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు స్థానికంగా ఉన్న వాగులు, వంకల నుంచి ఇసుక తవ్వకునేందుకు అనుమతులు ఇస్తారు. ప్రభుత్వానికి చలానా రూపేణా చెల్లించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారు. వాగుల నుంచి తరలించిన ఇసుకను సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాల వద్ద భారీగా నిల్వ చేస్తున్నారు. స్థానికులు, రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా అధికారులు దాడులు చేయడం లేదు. ఇసుక తరలించే వారిపై పోలీసు సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

నిత్యం ఇసుక తరలింపు



తాటిపల్లి గ్రామ సమీపంలోని పెన్‌గంగా నది నుంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తరలించడానికి నదిలోనే తాత్కాలికంగా రోడ్డు వేశారు. వందల ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండడంతో వాగులో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇసుక తరలిస్తుండడంతో వాగు మధ్యలో ఉన్న శ్రీ హనుమాన్ మందిరం ఆవరణ సైతం ఏటా కొంత కోతకు గురవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎ.దత్తు, ఆలయ చైర్మన్, తాటిపల్లి

రైతులు తస్మాత్ జాగ్రత్త!

- ఎరువులు, విత్తనాల ఎంపికలో తొందరపాటు వద్దు
- లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే కొనుగోలు చేయాలి
- పంటపొలాలు సిద్ధం చేస్తున్న అన్నదాతలు



దుక్కి దున్ని సిద్ధం చేసిన చేను

లింగాపూర్: వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు సమకూర్చుకోవాల్సిన సమయం ఇది. మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు రైతులను ఊరిస్తున్నాయి. అయితే విత్తనాలు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని నిపుణులు పేర్కొంటున్నారు. కల్తీ విత్తనాలైతే మొలకెత్తక ముందే రైతు చిత్తవుతాడు.. ఎరువులు నాణ్యత లేకుంటే రైతుకు అప్పులు తప్ప ఏమీ మిగలవని అవగాహన కల్పిస్తున్నారు.

తొలకరికి ముందే..

మండలంలోని కొత్తపల్లి, కంచన్‌పల్లి, లింగాపూర్, కీమానాయక్‌తండా, పిక్లాతండా, జాముల్‌ధర, నడ్డంగూడ, ఏల్లాపటార్, దంపూర్, చోర్‌పల్లితో పాటు తదితర గ్రామాలలో జల్లులు కురవడంతో రైతులు, ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీలు గ్రామాలలో వివిధ ప్రచార రథాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి.

మండలంలో సాగు చేసే పంటలు ఎకరాల్లో(అంచనా)..	
పత్తి	17,000
కంది	2,500
సోయా	750
ఇతర పంటలు	3,550
మొత్తం	23,800

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రస్తుత కాలంలో గ్రామాల్లోని కొందరు దళారులు బయట నుంచి నకిలీ, నాసిరకం విత్తనాలను తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారు. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. లైసెన్స్ పొందిన షాపుల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలి. ఫర్టిలైజర్ షాపులో డీలర్‌లు ఉత్పత్తులను ప్రభుత్వ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– సంజయ్ కుమార్, ఏవో

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

డీలర్ల ఆఫర్లు..

పలు కంపెనీలు డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ, స్వదేశీ టూర్లు ఆఫర్ చేయడంతో డీలర్లు అవసరానికి మించి ఎక్కువ మొత్తంలో సదరు కంపెనీకి చెందిన విత్తనాలను, పురుగు మందులను రైతులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

మోతాదుకు మించితే నష్టమే..

రైతులు అధిక దిగుబడులపై ఆశతో విత్తనాలతో పాటు ఎరువులను మోతాదుకు మించి వినియోగిస్తే లాభం కంటే ఎక్కువగా నష్టాలే మిగిలుతాయని నిపుణులు చెబుతున్నారు. ఎరువులు, పురుగు మందుల విషయంలో మోతాదుకు మించి వాడొద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఏటీఎం సెంటర్లు లేక ఇక్కట్లు



బ్యాంకు వద్ద క్యూలో నిల్చున్న ఖాతాదారులు (ఫైల్)

- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి నష్టపోతున్న ప్రజలు
- మండలంలో పదివేలకు పైగా ఖాతాదారులు

తిర్యాణి: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. దీంతో పాటు అన్ని గ్రామాల్లో పత్తి, ధ్యానం కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు సైతం రైతులకు సంబంధించిన ఖాతాల్లో పంట నగదు వేస్తున్నారు. కానీ మండలంలో నగదు విత్‌డ్రా కోసం ఒక్క ఏటీఎం సెంటర్ కూడా లేకపోవడంతో సామాన్య జనంతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో బ్యాంకు ఎదుట రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.

అందుబాటులో ఏటీఎం సేవలు..

మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దాదాపు పది వేలకు పైగా ఖాతాలుండగా మండలంలో ఇప్పటికీ ఒక్క ఏటీఎం సెంటర్ కూడా అందుబాటులో లేదు. ఏటీఎం సేవలు వినియోగించుకోవడం కోసం మండల కేంద్రంలో దాదాపు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఖాతాదారుల అవసరాన్ని వాడుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు పదుల సంఖ్యలో మినీ ఏటీఎంలు ప్రారంభించారు. ఖాతాదారుల వేలిముద్రల ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి అందజేస్తున్నారు. ఇందుకోసం రూ.10 నుంచి రూ. 100 వరకు కమీషన్ వసూలు చేస్తున్నారు. మండలంలో అత్యధికంగా నిరక్ష్యరాస్యులైన గిరిజనులు ఉండడంతో వారిని మోసం చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఖాతాదారులకు తెలియకుండానే నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకున్నట్లు గతంలో పోలీసులకు సైతం ఫిర్యాదులు అందాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు మండల కేంద్రంలో ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

ఏటీఎం ఏర్పాటు చేయాలి



మండలంలో ఏటీఎం సెంటర్ అందుబాటులో లేకపోవడంతో స్థానిక గ్రామాల ప్రజలు దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలేటి, ఐబీ తాండూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి ఏటీఎం సేవలు వినియోగించుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే మినీ ఏటీఎం సెంటర్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నాం.

– సార రమేశ్ గౌడ్, గడలపెల్లి

శిక్షణకు విధిగా హాజరవ్వాలి



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న రమేశ్‌బాబు



కెరమెరి: మాట్లాడుతున్న ఎంఈవో ఆదే ప్రకాశ్

వాంకిడి: బోధన సామర్థ్యాలు పెంపొందించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ప్రతీ ఉపాధ్యాయుడు విధిగా హాజరు కావాలని కోర్సు డైరెక్టర్, మండల విద్యాధికారి శివచరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు బోధన సామర్థ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి శనివారం వరకు 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మొదటి రోజు 106 మందికి 98 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్‌లు రవి కుమార్, రాజశేఖర్, శివరాజ్, సుదీర్‌బాబు, హరీశ్, రవీందర్, లక్ష్మణ్, సీఆర్పీలు దుర్గం సందీప్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

పెంచికల్‌పేట్: మండల స్థాయిలో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతీ అంశాన్ని నేర్చుకుని తరగతి గదిలో అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఉండాలి..

కెరమెరి: ఉపాధ్యాయుల శిక్షణకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు హాజరు కావాలని మండల విద్యాధికారి ఆదే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో మంగళవారం ప్రారంభమైన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ పాఠ్యాంశాల బోధనలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఐదు రోజులు కొనసాగే శిక్షణలో కేటాయించిన టీచర్లు అందరూ పాల్గొనాలని, ఇక్కడ విన్న అంశాల ఆధారంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. విద్యాభివృద్ధితో పాటు పాఠశాల నిర్వహణ, రికార్డుల నమోదు తదితర అంశాలపై క్లుప్తంగా బోధించాలని ఆర్‌పీలకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేలా చూడాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై తల్లిదండ్రులకు వివరించి ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో ఉపాధ్యాయులకు మండలస్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు ఐదురోజుల పాటు కొనసాగుతాయని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు పర్చాలన్నారు. ఎంపీడీవో కోట ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న శిక్షణ విధానాలను ఉపాధ్యాయులు అర్థం చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ నాగరాజు, జిల్లా రిసోర్స్ పర్సన్ బాలకృష్ణ, ఎంఈవో వాసాల ప్రభాకర్, మండల రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో గావుడే హన్మంతు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు అన్ని సబ్జెక్టుల్లో శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలను మెరుగు పర్చుకునేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని, ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు సాయికిరణ్, తిరుపతి, సునీల్, శివాజీ, విజయ్‌కుమార్, రావుజీ, సంజయ్, ప్రదీప్ పాల్గొన్నారు.



వాంకిడి: మాట్లాడుతున్న శివచరణ్ కుమార్



కౌటాల: మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు



కాగజ్‌నగర్‌టౌన్: హాజరైన ఉపాధ్యాయులు

బదిలీపై వెళ్తున్న ఏఎస్సైకి సన్మానం



ఏఎస్సైని సన్మానిస్తున్న ఎస్సై, సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈస్‌గాం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సంజీవ్ కుమార్‌పాల్ సిర్పూరు(టి) పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఆయనను మంగళవారం సన్మానించారు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ గత ఏడేళ్లుగా క్రమశిక్షణతో నిబద్ధతతో త్తమ విధులు నిర్వహించాడన్నారు. మిగిలిన సర్వీసులో కూడా ఎలాంటి రిమార్కు రాకుండా ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు పెడుతూ అధికార పార్టీ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌పై కేసులు పెట్టడం సరికాదని, ముందు అధికార పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు ధరణి రాజేశ్, భరత్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కాగజ్‌నగర్‌టౌన్: అటవీశాఖ అధికారుల వ్యవహార తీరును నిరసిస్తూ మంగళవారం జర్నలిస్టులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఫారెస్టు డివిజన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విలేకరుల సమావేశం ఉందని సమాచారం ఇచ్చారన్నారు. అధికారులు రెండు గంటల పాటు ఆలస్యంగా సమావేశాన్ని నిర్వహించడంతో కార్యాలయంలోనే వేచిచూశామని, సరైన సమయంలో సమావేశం నిర్వహించకపోవడంతో ఎండ వేడిమి భరించలేక నానా ఇబ్బందులు పడ్డామని తెలిపారు. అనంతరం కార్యాలయం జర్నలిస్టులు నిరసన తెలపడంతో ఎట్టకేలకు మధ్యాహ్నం 1 గంటకు మొక్కుబడిగా సమావేశం నిర్వహించి మమ అనిపించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

బేల: మెగా రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించిందని, అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఏఎస్ గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల యువకులు, వయోజనులు 75మంది రక్తదానం చేశారు. పార్టీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నాయకులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి పురస్కరించుకొని గురువారం ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, ఇతర ప్రత్యేక పూజలు, మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ అనంతరం ఉదయం 10 గంటల నుంచి మహా అన్నప్రసాదవితరణ కార్యక్రమం ఉంటుందని, జయంతి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.